

ANDHRAJYOTHY


ఆంధ్రజ్యోతి

5

అనకాపల్లి

జిల్లా వార్తలు

శనివారం 20 జనవరి 2024



నేడు వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

అనకాపల్లి టౌన్, జనవరి 19: పట్టణంలోని వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఉత్సవం శనివారం జరగనుంది. తెల్లవారుజామున ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు గౌరీపరమేశ్వరుల దర్శనం ప్రారంభం అవుతుందని ఉత్సవ కమిటీ పేర్కొంది. కాగా చిననాలుగురోడ్ల జంక్షన్ నుంచి శారదా నది వరకు పలుచోట్ల భారీ విద్యుత్ సెట్టింగులు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం తరువాత ఉత్సవమూర్తుల ఊరేగింపు ప్రారంభం అవుతుంది. పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ జి.శంకరరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల ఉత్సవం సందర్భంగా మెయిన్ రోడ్డుపై ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా భారీ వాహనాలతోపాటు ఆర్టీసీ బస్సులను పూడిమడక రోడ్డులో నుంచి జాతీయ రహదారి మీదుగా మళ్లించినట్టు ట్రాఫిక్ సీఐ టి.శ్రీను తెలిపారు. - వివరాలు 7వ పేజీలో..

నేడు చంద్రబాబు అరకు పర్యటన

» 'రా.. కదలిరా' బహిరంగ సభలో పాల్గొననున్న టీడీపీ అధినేత

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో శనివారం 'రా.. కదలిరా' నినాదంతో నిర్వహించనున్న బహిరంగ సభలో తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు పాల్గొననున్నారు. ఆయన శనివారం ఉదయం 10.10 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 11 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. ఇక్కడ ఎయిర్‌పోర్టు నుంచి 11.05 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 11.30 గంటలకు డుంబ్రిగుడ మండలం అరకుకు చేరుకుంటారు. 11.40 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సభలో ప్రసంగిస్తారు. అనంతరం స్థానిక నాయకులతో కొద్దిసేపు మాట్లాడతారు. తరువాత మధ్యాహ్నం రెండు గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట వెళతారు.



భారీ ఏర్పాట్లు

అరకులోయ సమీపంలోని డుంబ్రిగుడ మండలం అరకు గ్రామం వద్ద నిర్వహించనున్న బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు చేశారు. మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, టీడీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి దామచర్ల సత్యం, అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి అయిన ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, తదితరులు శుక్రవారం ఇక్కడకు వచ్చి ఏర్పాట్లను పరిశీలించారు. అరకులోయ, పాడేరు, సాలూరు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు సభలో పాల్గొనే అవకాశం ఉందని చెప్పారు.

అభివృద్ధికి ఆమడ దూరం..

రాయపురాజుపేటపై వైసీపీ ప్రభుత్వం చిన్నచూపు

» అందుబాటులోకి రాని సచివాలయం, హెల్త్‌సెంటర్ భవనాలు
» బిల్లులు రాకపోవడంతో భవనాలు అప్పగించని కాంట్రాక్టర్
» పంచాయతీ భవనంలోని ఇరుకు గదిలో సచివాలయం నిర్వహణ
» అసంపూర్తిగా నిలిచిన ఆర్‌బీకే భవనం
» నాలుగేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైన ఎర్రిగెడ్డపై కాజ్‌వే నిర్మాణం
» రాకపోకలకు ఇబ్బంది పడుతున్న పలు గ్రామాల రైతులు



పంచాయతీ కార్యాలయంలో ఒక గదిలో నిర్వహిస్తున్న గ్రామ సచివాలయం (ఇన్‌సెట్‌లో) ప్రారంభానికి నోచుకోని సచివాలయ భవనం

చోడవరం, జనవరి 19:

మండలంలోని రాయపురాజుపేట పంచాయతీ అభివృద్ధికి ఆమడదూరంలో వుంది. గ్రామ సచివాలయం సొంత గూడుకు నోచుకోకపోవడంతో పంచాయతీ కార్యాలయంలో చిన్నపాటి గదిలో నడిపిస్తున్నారు. సచివాలయం, హెల్త్‌సెంటర్, ఆర్‌బీకేల కొత్త భవనాలు అందుబాటులోకి రాలేదు. పంచాయతీలో సొంత ఇళ్లు, స్థలాలు లేని పేదలు ఎంతో మంది ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇక్కడ మాత్రం ఇళ్ల స్థలాలు ఇవ్వలేదు, పక్కా ఇళ్లు (జగనన్న కాలనీ) మంజూరు చేయలేదు. ఐదేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు తప్ప.. ఆ తరువాత ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని గ్రామస్థులు చెబుతున్నారు.

అందుబాటులోకి రాని ప్రభుత్వ భవనాలు

రాయపురాజుపేట పంచాయతీలో గ్రామ సచివాలయం, హెల్త్‌సెంటర్, రైతు భరోసా కేంద్రాలకు మూడేళ్ల క్రితం భవనాలు మంజూరయ్యాయి. సచివాలయం, హెల్త్‌సెంటర్ భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. పూర్తిస్థాయిలో బిల్లులు మంజూరు కాకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ భవనాలను అప్పగించలేదు. ఆర్‌బీకే భవన నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. సచివాలయాన్ని పంచాయతీ కార్యాలయంలో చిన్న గదిలో కొనసాగిస్తున్నారు. ఈ పంచాయతీతోపాటు శేమునాపల్లి పంచాయతీకి కూడా ఇదే సచివాలయం. వసతి చాలక ఉద్యోగులతోపాటు ప్రజలు కూడా ఇబ్బంది పడుతున్నారు.

సొంతగూడుకు నోచుకోని పేదలు

మండలంలోని అన్ని పంచాయతీల్లో జగనన్న కాలనీల పేరుతో లేవుట్లు వేసి పేదలకు స్థలాలు, పక్కా ఇళ్లు మంజూరు చేయగా రాయపురాజుపేట పేదలు మాత్రం వీటికి నోచుకోలేదు. పంచాయతీ పరిధిలో ప్రభుత్వ స్థలాలు, బంజరు భూములు ... మిగతా 8వ పేజీలో



అసంపూర్తిగా రైతు భరోసా కేంద్రం భవన నిర్మాణం

తాడి నెత్తిన మరో కుంపటి

ఫార్మా సిటీ కాలుష్యంతో ఇప్పటికే ఉక్కిరిబిక్కిరవుతున్న గ్రామం

» తరలించాలని ఎప్పటి నుంచో డిమాండ్
» ఇదిగో.. వారం రోజుల్లో నిధులు విడుదల చేస్తానన్న సీఎం
» ఏడాదైనా నెరవేరని హామీ
» గ్రామానికి ఒక వైపున ఇప్పటికే ఘన వ్యర్థాల నిల్వ ప్లాంటు
» దాంతో తాడి పరిసరాల్లో భూగర్భ జలాలు కలుషితం
» ఇప్పుడు మరొక ప్లాంటు ఏర్పాటుకు ప్రతిపాదన
» 30న పరవాడలో ప్రజాభిప్రాయ సేకరణ
» ప్రజల ఆరోగ్యం కంటే రాంకీ ప్రయోజనాలే ముఖ్యమా!?
» గ్రామస్థుల ఆందోళన



తాడి గ్రామానికి కుడి వైపున సర్వే నంబరు 119లో ప్లాంట్ ఏర్పాటుకు కేటాయించిన స్థలం

విశాఖపట్నం/పరవాడ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):

"కాలుష్యంతో ఇబ్బందిపడుతున్న తాడి గ్రామాన్ని తరలిస్తాం. గ్రామ తరలింపునకు అవసరమైన రూ.56 కోట్లు వారం రోజుల్లో విడుదల చేస్తాం."

- ఇదీ 2022 ఏప్రిల్ 28న సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో జగనన్న కాలనీకి శంకుస్థాపన సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన ప్రకటన.

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ఇప్పటికీ నెరవేరలేదు సరికదా...గ్రామానికి మరోవైపు మరొక ఘన వ్యర్థాల ప్లాంటు ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ఇందుకోసం ఈ నెల 30వ తేదీన ప్రజాభిప్రాయ సేకరణ జరగనున్నది.

పరవాడ మండలంలో గల రాంకీ ఫార్మాసిటీలోని బల్క్ డ్రగ్ పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యంతో సమీపంలో గల తాడి గ్రామం ఇబ్బందిపడుతుంది. ఘన వ్యర్థాల నిల్వ ప్లాంటు ఏర్పాటుతో చివరకు గ్రామ పరిసరాల్లో భూగర్భ జలాలు కూడా కలుషితమైపోయాయి. కాలుష్యం నుంచి తమను రక్షించాలని గ్రామస్థులుగా దశాబ్దాలుగా కోరుతున్నారు. అయితే ఆ దిశగా ఎటువంటి ఆలోచన చేయకపోగా గ్రామానికి మరో వైపున ఇంకొక ఘన వ్యర్థాల ప్లాంటు ఏర్పాటుకు ప్రతిపాదించడంతో గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తమవుతుంది.

పరవాడ రాంకీ ఫార్మాసిటీలోని పరిశ్రమల నుంచి విడుదలైన ఘన వ్యర్థాల నిల్వ కోసం తాడి రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబరు 119లో సుమారు 50 ఎకరాల్లో ప్లాంటు ఏర్పాటుకు ఈనెల 30న పరవాడలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. రాంకీ ఫార్మా సిటీలో గల 100కుపైగా బల్క్ డ్రగ్ కంపెనీల నుంచి ద్రవ, ఘన వ్యర్థాలు విడుదలవుతుంటాయి. రెండింటి నిర్వహణ బాధ్యత రాంకీ ఫార్మాసిటీ యాజమాన్యానిదే. ద్రవ వ్యర్థాలను ట్రీట్‌మెంట్ ప్లాంటులో శుద్ధి చేసి సముద్రంలోకి విడిచిపెడుతుంటారు. ఘన వ్యర్థాలను ల్యాండ్ ఫిల్ కోసం తాడి గ్రామానికి ఆనుకుని కొండ సమీపంలో ప్లాంట్ ఏర్పాటుచేశారు.

ఒక అంచనా మేరకు ఫార్మాసిటీలోని కంపెనీల నుంచి ప్రతినెలా పది వేల టన్నుల ఘన వ్యర్థాలు తాడి దగ్గర ప్లాంటుకు వస్తున్నాయిఇ. ఒక్క ఫార్మా సిటీ కాకుండా ఉత్తరకోస్తాలోని శ్రీకాకుళం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా వరకు కెమికల్, డ్రగ్ కంపెనీల నుంచి వచ్చే ఘన వ్యర్థాలు ఈ ప్లాంటుకు తరలిస్తుంటారు. సుమారు పదేళ్ల నుంచి ... మిగతా 8వ పేజీలో



విశాఖ విమానాశ్రయంలో సినీ నటుడు చిరంజీవి. పక్కన మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు

విశాఖకు చిరంజీవి

విశాఖపట్నం, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):

సినీ నటుడు చిరంజీవి శుక్రవారం సాయంత్రం విశాఖపట్నం వచ్చారు. రుషికొండలోని ఏ-1 కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం జరిగే లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారాల ప్రదాన కార్యక్రమానికి ఆయన్ను ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. హైదరాబాద్ నుంచి ఆయనతో పాటు అదే విమానంలో మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు కూడా వచ్చారు. చిరంజీవి రాడీసన్ బ్లూ హోటల్‌లో బస చేయగా, లోక్‌నాయక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, రాజ్యసభ మాజీ సభ్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, హోటల్ యజమాని ఉమేశ్, తదితరులు కలిసి మాట్లాడారు.

21న అనుచరులతో సమావేశం

» మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ



విశాఖపట్నం, జనవరి 19:

రాష్ట్రాభివృద్ధితో పాటు విశాఖ స్టీల్‌ప్లాంటు, పోలవరం ప్రాజెక్టు, రైల్వే జోన్, ఉత్తరాంధ్ర సృజల స్రవంతి వంటి పలు అంశాలపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో చర్చించినట్టు మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ తెలిపారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో పవన్‌కల్యాణ్‌ను కలిసిన ఆయన శుక్రవారం నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ రాజకీయపరంగా నిర్ణయం తీసుకోవాలంటూ తన శ్రేయోభిలాషులు, అభిమానులు చాలాకాలంగా కోరుతున్నారన్నారు. ఈ నెల 21న అనకాపల్లి రింగురోడ్డులోని ఒక ఫంక్షన్ హాల్‌లోఅందరితో సమావేశమై వారి సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకొని పార్టీలో చేరికపై తన నిర్ణయాన్ని ప్రకటించనున్నట్టు కొణతాల చెప్పారు.

రక్తమోడిన రహదారులు

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురి మృతి

» అనకాపల్లి మండలం శంకరం వద్ద కారు బోల్తా
» తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ముగ్గురు దుర్మరణం
» దువ్వాడ నాగదేవత ఆలయం వద్ద బైక్‌ను ఢీకొన్న టిప్పర్
» యువకుడు, అతడి అన్న కుమార్తె మృతి
» మాకవరపాలెం మండలంలో రామన్నపాలెం సెంటర్ వద్ద చెట్టును ఢీకొన్న బైక్
» జి.కోడూరుకు చెందిన మహిళ మృతి

-వివరాలు మెయిన్ ఎడిషన్, 7వ పేజీలో..



అనకాపల్లి మండలం శంకరం సమీపంలో జాతీయ రహదారిపై మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు.





దువ్వాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హంసిని, వెంకట ప్రసాద్ (ఫైల్ ఫొటోలు)

ఎన్నికల నిర్వహణకు ముందస్తు సన్నాహాలు!

» పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన పనులు
» దివ్యాంగుల కోసం ర్యాంపుల నిర్మాణం
» తుది ఓటరు జాబితాల తయారీలో అధికారుల బిజీ

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

రానున్న సార్వత్రిక ఎన్నికల కోసం అధికార యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నది. నోటిఫికేషన్ ఎప్పుడు వెలువడినప్పటికీ హడావుడి పడకుండా వుండేందుకు ప్రాధాన్యత క్రమంలో పనులు చేస్తున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు వివిధ రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఓటరు తుది జాబితాల తయారీలో బిజీగా వున్నారు. ఈనెల 22వ తేదీన తుది ఓటరు జాబితాలను ప్రకటిస్తారు.



అనకాపల్లి మండలంలో ఒక పోలింగ్ కేంద్రం వద్ద ర్యాంపును పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్ ఫొటో)

జిల్లా ఎలక్టోరల్ అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఇప్పటికే అన్ని పోలింగ్ కేంద్రాల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. రిటర్నింగ్ అధికారులను పోలింగ్ కేంద్రాల వద్ద పనుల పర్యవేక్షణ అధికారులుగా నియమించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ఎన్నికల సిబ్బంది విధి నిర్వహణకు అవసరమైన ఫర్నిచర్, వికలాంగుల కోసం ర్యాంపులు వంటి సదుపాయాలపై ఒక స్పష్టతకు వచ్చారు. తొలిదశ కింద జిల్లాలో 98 కేంద్రాల్లో పోలింగ్ నిర్వహణకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్, తాగునీరు, ఫర్నిచర్, ఫ్యాన్‌లు, మరుగుదొడ్లు వంటివి వుండేలా చూడాల్సిన బాధ్యలను సంబంధిత అధికారులకు అప్పగించారు. దివ్యాంగులు వీల్‌చైర్‌లోనే పోలింగ్ కేంద్రం లోపలికి వెళ్లేందుకు అనువుగా 26 పోలింగ్ కేంద్రాల వద్ద కొత్త ర్యాంపులు నిర్మించాలని గుర్తించారు. మిగిలిన చోట్ల చిన్నపాటి మరమ్మతులు చేపడితే సరిపోతుందని అధికారులు చెబుతున్నారు. ర్యాంపుల నిర్మాణ బాధ్యతలను విద్యా శాఖాధికారులకు అప్పగించారు. ఎన్నికల నిర్వహణ పనులను కలెక్టర్ స్వయంగా పరిశీలిస్తూనే నిరంతరం పర్యవేక్షణ బాధ్యతలను డీఆర్‌ఓ దయానిధికి అప్పగించారు. పోలింగ్ కేంద్రాల వద్ద వసతుల కల్పన పనులను సంబంధిత నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.

క్రైం... crime news

వెంటాడుతున్న రోడ్డు ప్రమాదాలు

- దువ్వాడ సమీపంలో బైక్‌ను ఢీకొన్న టిప్పర్
- యువకుడు, అతడి అన్న కుమార్తె మృతి
- ఐదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలోనే పెద్ద కుమారుడు దుర్మరణం
- ఇప్పుడు చిన్న కుమారుడు, మనమరాలు...
- భోరుమన్న వృద్ధ దంపతులు


హంసిని (ఫైల్).. వెంకటప్రసాద్ (ఫైల్)

కూర్మన్నపాలెం, జనవరి 19: ఆ కుటుంబాన్ని రోడ్డు ప్రమాదాలు వెంటాడుతున్నాయి. సరిగ్గా ఐదేళ్ల కిందట పెద్ద కుమారుడు రోడ్డు ప్రమాదంలోనే అశువులు బాయగా, శుక్రవారం రెండో కుమారుడు, మనుమరాలు అదేరీతిలో తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో వారి రోదన వర్ణనాతీతంగా ఉంది. దువ్వాడ నాగదేవత కొండ వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం కలిగొట్లలో నివాసం ఉం టున్న కొల్లి పద్మ తన కుమార్తె హంసిని (8)తో కలిసి సంక్రాంతికి గాజువాక చిట్టినాయుడు కాలనీలో గల అత్త వారింటికి వచ్చింది. పండుగ అయిపోయిన తరువాత హంసినిని పద్మ తన అత్తింటి వద్ద వదిలిపెట్టి కలిగొట్ల వెళ్లింది. శుక్రవారం సాయంత్రం హంసినిని తీసుకుని ఆమె బాబాయి కొల్లి వెంకటప్రసాద్ (31) ద్విచక్ర వాహనంపై కలిగొట్ల బయలుదేరాడు. వీరి వాహనాన్ని నాగదేవత కొండ సమీపంలో టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరూ సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుల కుటుంబ సభ్యులకు సమాచారాన్ని చేరవేశారు. సంఘటనా స్థలాన్ని ఏడీసీపీ, ఏసీపీ సందర్శించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాడు పెద్ద కొడుకు...నేడు చిన్న కుమారుడు, మనుమరాలు

అచ్యుతాపురం సమీపంలోని దొప్పెర్లకు చెందిన కొల్లి పైడిరాజు 30 ఏళ్ల కిందట బతుకుతెరువు కోసం ఆటోనగర్ ప్రాంతానికి వచ్చారు. ఆయన భార్య దేముడమ్మ, వీరికి శివ, వెంకటప్రసాద్, శాంతి పిల్లలు. వీరిలో పెద్దకుమారుడు శివకు దేవరాపల్లి మండలం కలిగొట్లకు చెందిన పద్మతో వివాహమైంది. వారికి ఓ కుమార్తె హంసిని (8) ఉంది. కాగా శివ ఐదేళ్ల క్రితం దొప్పెర్ల వెళుతూ దేశపాత్రునిపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అప్పటి నుంచి అతడి భార్య పద్మ తన కన్నవారింట ఉంటోంది. రెండో కుమారుడు వెంకటప్రసాద్ ఫార్మా కంపెనీలో పనిచేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉన్నాడు. అతడికి తన మామ కుమార్తెతో ఇటీవల వివాహం నిశ్చయమైంది. మరో మూడు నెలల్లో పెళ్లి జరగనుంది. ఈ లోగా తన అన్న కుమార్తెను ఆమె తల్లి దగ్గరకు తీసుకువెళుతుండగా జరిగిన ప్రమాదంలో వెంకటప్రసాద్ మృతిచెందాడు. ఐదేళ్ల క్రితం పెద్దకొడుకు, ఇప్పుడు చిన్న కొడుకు, మనమరాలు మృతిచెందడంతో వృద్ధ దంపతులు కన్నీరుమున్నీరయ్యారు. ఇదే ప్రమాదంలో హంసిని మృతిచెందడంతో శివ భార్య పద్మ ఒంటరిగా మిగిలిపోయింది.

చెట్టును ఢీకొన్న బైక్

- భార్య మృతి.. భర్తకు తీవ్ర గాయాలు

మాకవరపాలెం, జనవరి 19 : బంధువు చనిపోవడంతో పరామర్శకు వెళ్లి వస్తున్న దంపతులు రోడ్డు ప్రమాదానికి గురికావడం., భార్య మృత్యువాత పడగా, భర్త తీవ్ర గాయాలతో ఆస్పత్రిపాలు కావడం వంటి ఘటనలు మాకవరపాలెం మండలంలో చోటుచేసుకున్నాయి. ఇందుకు సంబంధించిన వివరాలివి. మండలంలోని జి.కోడూరు గ్రామానికి చెందిన ఆడారి నాగేశ్వరరావు, భువనేశ్వరి దంపతులు శుక్రవారం ఉదయం ఎలమంచిలి గ్రామానికి బైక్‌పై బయల్దేరి వెళ్లారు. అక్కడ తమ బంధువు చనిపోవడంతో పరామర్శించిన అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. మాకవరపాలెం మండలం రామన్నపాలెం సెంటర్ వద్దకు వచ్చే సరికి ఎదురుగా వస్తున్న వాహన్ని తప్పించబోయే క్రమంలో పక్కనే ఉన్న చెట్టును బలంగా ఢీకొన్నారు. ఈ ఘటనలో భువనేశ్వరి (48) అక్కడికక్కడే మృతి చెందగా, భర్త నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతనిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకు వెళ్లగా, పరిస్థితి విషమించడంతో విశాఖపట్నం కేజీహెచ్‌కు వైద్యులు తరలించారు. నర్సీపట్నం రూరల్ ఇన్‌చార్జి ఎస్ఐ ధనుంజనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

పెందుర్తి, జనవరి 19: రహదారి గోతులు నవ వధువును బలిగొన్నాయి. వివరాలివి.. గోపాలపట్నం సమీపంలోని ఆర్ఆర్‌వీపురానికి చెందిన వెంకటప్పారావు ప్లంబింగ్ పనులు చేస్తుంటాడు. ఇతడికి సబ్బవరం మండలం గుల్లేపల్లికి చెందిన పెంటకోట సంతోషి (23)తో గత ఏడాది అక్టోబరులో వివాహం జరిగింది. గురువారం ఆర్ఆర్‌వీపురం నుంచి ద్విచక్రవాహనంపై భార్యాభర్తలు అత్తవారింటికి వెళ్లారు. రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి వస్తుండగా చీమలాపల్లి మీనాక్షి కల్యాణ మండపం సమీపంలోని రోడ్డుపైన ఉన్న పెద్ద గోతిలో బైక్ పడింది. దీంతో వెనుక కూర్చున్న సంతోషి కిందపడిపోవడంతో ఆమె తలకు తీవ్ర గాయమయింది. స్థానికులు 108 వాహనంలో ఆమెను కేజీహెచ్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆమె శుక్రవారం రాత్రి మృతి చెందింది. పెందుర్తి సీఐ మరిడాన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గెడ్డవాగు ఆక్రమణకు చెక్

- రియల్టర్ వేసిన సిమెంట్ గొట్టాలు, రోడ్డు తొలగింపు
- మరోసారి రోడ్డు నిర్మిస్తే క్రిమినల్ కేసు పెడతామని తహసీల్దారు హెచ్చరిక... 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్


గెడ్డవాగులో తొలగించిన సిమెంటు గొట్టాలు... పూర్వ స్థితిలో వున్న గెడ్డవాగు

పరవాడ, జనవరి 19: పరవాడ రెవెన్యూ పరిధి సర్వే నంబరు 304లో వున్న గెడ్డ వాగును ఆక్రమణకు రెవెన్యూ అధికారులు చెక్ పెట్టారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి ఒకరు గెడ్డలో సిమెంటు పైపులు వేసి, వాటిపై రహదారి నిర్మాణం చేపట్టిన వైనంపై ఈ నెల 17వ తేదీన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'రియల్ బరితెగింపు' కథనంతో తహసీల్దారు పి.కనకారావు స్పందించారు. శుక్రవారం ఆయన పర్యవేక్షణలో రెవెన్యూ సిబ్బంది రెండు ఎక్స్‌కవేర్లను రప్పించి గెడ్డలో పైపులను తొలగించి, రహదారిని ధ్వంసం చేశారు. గెడ్డవాగులో నుంచి మరోసారి రహదారి నిర్మాణం చేపడితే క్రిమినల్ కేసులు పెడతామని సంబంధిత రియల్టర్‌ను హెచ్చరించారు. సంక్రాంతి పండుగతోపాటు అంతకుముందు రెండో శనివారం, ఆదివారం వరుసగా సెలవు రోజులు కావడంతో ప్రభుత్వ ఉద్యోగులు ఇక్కడ వుండరన్న ఉద్దేశంతో సదరు రియల్టర్ ఆదరాబాదరాగా గెడ్డవాగులో నుంచి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు గెడ్డలో నిర్మించిన రహదారిని తొలగించారు. కానీ సహజ వనరులను ధ్వంసం చేసిన రియల్టర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయకపోవడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితోనే రియల్టర్‌పై క్రిమినల్ కేసు పెట్టలేదని అంటున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

నేడు వేల్పులవీధి గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

- అడుగడుగునా విద్యుత్ సెట్టింగ్‌లు, తోరణాలు


వేల్పులవీధి గౌరమ్మ గుడి ముందు అమ్మవారి విద్యుత్


ఎన్టీఆర్ జంక్షన్‌లో అమ్మవారి విద్యుత్ సెట్టింగ్

అనకాపల్లి టౌన్, జనవరి 19: ప్రఖ్యాతిగాంచిన వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఉత్సవం శనివారం జరగనుంది. ఉత్సవ ఏర్పాట్లను ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వాకాడ బాబు, మద్దాల నూకరాజు ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు చేశారు. శనివారం తెల్లవారుజామున గౌరీపరమేశ్వరులకు పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నారు. పట్టణంలోని చిననాలుగురోడ్ల జంక్షన్ నుంచి శారదానది వరకు మెయిన్‌రోడ్డు మీదుగా భారీ విద్యుత్ సెట్టింగ్‌లు, విద్యుత్ తోరణాలను ఏర్పాటు చేశారు. ఆల యాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఉత్సవంలో భాగంగా సాయంత్రం నుంచి పలు రకాల నేలవేషాలను ఏర్పాటు చేశామని కమిటీ చైర్మన్ బాబు తెలిపారు. మధ్యాహ్నం గౌరీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను రథంపై ఏర్పాటు చేసి పురవీధుల గుండా ఊరేగించి, సోమవారం అనుపు మహోత్సవం నిర్వహిస్తామన్నారు. అలాగే చిననాలుగు రోడ్ల జంక్షన్, రామచంద్ర థియేటర్, పూడిమడకరోడ్డు రామాలయం, వేల్పుల వీధి, పాత శారదాబ్రిడ్జిల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. ఉత్స వంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పట్టణ సీఐ జి.శంకరరావు ఆధ్వర్యంలో భారీ ఎత్తున బందోబస్తును ఏర్పాటు చేశారు.

ట్రాఫిక్ ఆంక్షలు

మెయిన్‌రోడ్డులో వేల్పులవీధి వద్ద గౌరీ పరమేశ్వరుల ఉత్సవం సందర్భంగా వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ టి.శ్రీను తెలిపారు. మెయిన్‌రోడ్డుపై ఎటువంటి భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్టీసీ బస్సులు కూడా పూడిమడకరోడ్డులోంచి జాతీయ రహదారి మీదుగా అటు విశాఖపట్నం, విజయనగరం ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తాయని ఆయన తెలిపారు.

వినూత్న రీతిలో ఉపాధ్యాయుల నిరసన


చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

అనకాపల్లి టౌన్, జనవరి 19: స్థానిక నెహ్రూచౌక్ వద్ద శుక్రవారం సాయంత్రం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు వినూత్నరీతిలో నిరసన తెలిపారు. చెవిలో పువ్వులు పెట్టుకుని తమకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలంటూ నినాదాలు చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం బకాయిపడ్డ రూ.18,096 కోట్లు వెంటనే చెల్లించాలని, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, ఓపీఎస్‌ను అమలు చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలంటూ నినాదాలిచ్చారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి గొంది చిన్నబ్బాయి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ. 18,096 కోట్లు ఉద్యోగులకు ఇంకా చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. యూటీఎఫ్ చేస్తున్న నిరసనల ఫలితంగా జడ్పీ పీఎఫ్ బకాయిలు కొంత చెల్లించినప్పటికీ మిగిలిన బకాయిల సంగతి ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వత్సవాయి శ్రీలక్ష్మి, కార్యదర్శి శేషుకుమార్, కోశాధికారి జోగా రాజేష్, రాష్ట్ర కౌన్సిలర్ మారిశెట్టి వెంకటఅప్పారావు, సీనియర్ నాయకులు జీకేఆర్ స్వామి, దేముడునాయుడు, సుభాషిణిదేవి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల రిలే దీక్షలు


రిలే దీక్షలో కూర్చున్న న్యాయవాదులు

అనకాపల్లి టౌన్, జనవరి 19: భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కోర్టు వద్ద అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం కూడా రిలే దీక్షలు కొనసాగించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సాయి లక్ష్మణ ఆధ్వర్యంలో న్యాయవాదులు కనిశెట్టి సురేష్‌బాబు, బంధం దుర్గారావు, మళ్ల హరినాథ్‌లు దీక్షలో కూర్చున్నారు. వీరికి పలువురు న్యాయవాదులు సంఘీభావం తెలిపారు. అంతేకాకుండా రిలే నిరాహారదీక్ష శిబిరాన్ని రైతు స్వరాజ్య వేదిక కన్వీనర్ గాడి బాలు, సీపీఐ, రైతు సంఘం నాయకులు వైఎస్ భద్రం, కోరిబిల్లి శంకరరావు, ఏడుకొండలు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పాత్రపల్లి వీరుయాదవ్ సందర్శించి, న్యాయవాదుల దీక్షకు సంఘీభావం తెలిపారు.

దళితులను వంచించిన ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు


మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, జనవరి 19: వైసీపీ పాలనలో దళితులను వంచించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిదేనని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగ జగదీశ్వరరావు ఆరోపించారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ.. అంబేడ్కర్ విగ్రహం పెట్టినంత మాత్రాన జగన్‌రెడ్డి దళితులను ఉద్దరించాననుకోవడం హాస్యాస్పదమన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో దళితులపై ఆరువేలకు పైగా కేసులు పెట్టారని, 188 మంది దళితులను హత్య చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులకు రాజ్యాంగబద్ధంగా అమలు కావాల్సిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి ఏ ముఖం పెట్టుకుని అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేపడతారని ఆయన ప్రశ్నించారు. నాలుగు లక్షల మంది దళితులకు ఉపాధి కల్పించిన ఘనత టీడీపీదేనన్నారు. అంబేడ్కర్ విదేశీ పథకాన్ని నాలుగేళ్ల పాటు అటకెక్కించారని, పైగా అంబేడ్కర్ పేరును తొలగించి జగన్‌రెడ్డి విదేశీ విద్యగా మార్చి అంబేడ్కర్‌ను అవమానించారన్నారు. రానున్న ఎన్నికల్లో దళితుల ఓట్లు కాజేయడానికే జగన్‌రెడ్డి కుట్ర చేస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో బెస్ట్ ఎవలేబుల్ స్కూల్స్‌ను తీసుకువస్తే జగన్‌రెడ్డి వాటిని రద్దు చేశారని చెప్పారు. దళిత మహిళల ఆత్మగౌరవానికి భంగం కలిగించే కేసుల్లో ఏపీ ప్రథమ స్థానంలో ఉందని నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో స్పష్టం చేసిందన్నారు. తెలుగుదేశంపార్టీ అధికారం చేపట్టిన వెంటనే దళితులను హింసించిన వారిని వదిలిపెట్టేది లేదని ఆయన చెప్పారు. సమావేశంలో టీడీపీ నాయకులు కాయల ప్రసన్నలక్ష్మి, సిమ్మిటి రామకృష్ణ, రేవడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు యండమూరికి లోక్‌నాయక్ సాహిత్య పురస్కారం

- ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

విశాఖపట్నం, జనవరి 18: ప్రముఖ నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌కు శనివారం 'లోక్‌నాయక్ ఫౌండేషన్' తరపున సాహిత్య పురస్కారం అందజేయనున్నట్టు ఫౌండేషన్ అధ్యక్షులు, పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఏయూలోని హిందీ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడిచిన 19 ఏళ్ల నుంచి వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారికి లోక్‌నాయక్ ఫౌండేషన్ తరపున పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. శనివారం ఉదయం 10.30 గంటలకు భీమిలి బీచ్‌రోడ్డులో రుషికొండ వద్ద గల ఏ1 గ్రాండ్ కన్వెన్షన్ సెంటర్‌లో ఎన్టీఆర్ 28వ పుణ్యతిథి, ఏఎన్ఆర్ శత జయంతి కార్యక్రమం ఏర్పాటుచేశామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పద్మభూషణ్ మెగాస్టార్ చిరంజీవి హాజరుకానున్నారన్నారు. అదే వేదికపై యండమూరి వీరేంద్రనాథ్‌కు సాహిత్య పురస్కారం, బెంగళూరు తెలుగు సమాఖ్య అధ్యక్షులు రాధాకృష్ణంరాజు, ప్రఖ్యాత మనో వైద్యులు డా.ఇండ్ల రామసుబ్బారెడ్డి, అంతర్జాతీయ పర్యాటక నిపుణులు విల్సన్ సుధాకర్ తుల్లుమిల్లిలకు జీవన సాఫల్య పురస్కారాలు అందజేయనున్నామన్నారు.

కనకమ్మ జాతరకు పోటెత్తిన భక్త జనం


ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన మహిళల కోలాటం... అమ్మవారిని దర్శించుకుంటున్న టీడీపీ నాయకులు పప్పల చలపతిరావు, ప్రగడ నాగేశ్వరరావు

ఎలమంచిలి, జనవరి 19: పట్టణంలోని ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి జాతరకు భక్తజనం పోటెత్తారు. శుక్రవారం రాత్రి జరిగిన అమ్మవారి తీర్థానికి వేలాది భక్తులు తరలిరావడంతో అమ్మవారి ఆలయ పరిసరాలతో పాటు రాజీవ్‌గాంధీ క్రీడామైదానం, వీధులన్నీ జనసంద్రంగా మారాయి. ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అమ్మవారి ఆలయంతో పాటు పట్టణ వీధుల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ, దేవతామూర్తుల విద్యుత్ సెట్టింగ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు తలపై నిప్పు కుండలు పెట్టుకుని వేసిన కోలాటం ఆకట్టుకుంది. తీర్థంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన జెయింట్ వీల్, డిస్కో రైలింగ్ వాహనాల వద్ద జనం క్యూ కట్టారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కన్నబాబు, ఎంపీపీ గోవింద్

కాగా, అమ్మవారిని ఎమ్మెల్యే కన్నబాబు, మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, ఎంపీపీ బోదెపు గోవింద్, మునిసిపల్ కమిషనర్ కొండలరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, మునిసిపల్ వైస్ చైర్మన్‌లు బినాగేశ్వరరావు, ఆర్రెపు గుప్తా దర్శించుకున్నారు. సాయంత్రం మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయ్ కుమార్ అమ్మవారిని దర్శించుకున్నారు. వీరితో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నేతలు దర్శించుకున్నారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ గఫూర్ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు. అలాగే పట్టణంలోకి వచ్చే వాహనాలను రేగుపాలెం, పెదపల్లి రైల్వే గేటు మీదుగా మళ్లించారు.

నాతవరంలో నయనానందకర బెలూన్


రామభక్తులు తయారు చేసిన బెలూన్

నాతవరం, జనవరి 19 : ఓ బెలూన్ నాతవరంతో పాటు ఇటుగా రాకపోకలు సాగించేవారిని విశేషంగా ఆకట్టుకుంటోంది. అయోధ్యలో సోమవారం బలరాముని విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్న నేపథ్యంలో అక్కడి రామ మందిరంతో పాటు సీతారాముల చిత్రాలతో ముద్రించిన బెలూన్‌ను శుక్రవారం పలువురు భక్తులు మండల కేంద్రంలోని ఓ ఇంటి మెడపై కట్టి గాలిలో ఎగురవేశారు. దీనిని చూసి నవారంతా జైశ్రీరామ్ నామస్మరణ చేస్తూ ముందుకు సాగుతున్నారు.

అదనపు ల్యాండ్‌ఫిల్ ఏర్పాటు చేయొద్దు

- సీఐటీయూ ఆధ్వర్యంలో తాడి వాసుల ఆందోళన


సబ్ జోనల్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతున్న తాడి గ్రామస్థులు

పరవాడ, జనవరి 19 : తాడి రెవెన్యూ పరిధి సర్వే నంబరు 116లో తలపెట్టిన అదనపు ఫార్మా ల్యాండ్ ఫిల్ ఏర్పాటును తక్షణమే ఉపసంహరించుకోవాలని తాడి వాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక సబ్‌జోనల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. రాంకీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం మరో 50 ఎకరాల్లో అదనపు ల్యాండ్ ఫిల్ ఏర్పాటుకు రంగం సిద్ధం చేసిందన్నారు. ప్రస్తుతమున్న ల్యాండ్‌ఫిల్ కారణంగా భూగర్భజలాలు కలుషితమైపోయాయని, ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. తాడి గ్రామాన్ని తరలిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చి 20 నెలలు కావస్తుందని, నేటికి గ్రామం తరలింపు ప్రక్రియ ప్రారంభం కాలేదన్నారు. ప్రజలను మరింత ఇబ్బందులకు గురిచేసే విధంగా రాంకీ యాజమాన్యం అదనపు ల్యాండ్‌ఫిల్‌ను ఏర్పాటు చేయాలని సిద్ధం కావడం సిగ్గుచేటన్నారు. అదనపు ల్యాండ్‌ఫిల్ విషయమై ఈనెల 30న పరవాడ తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాభిప్రాయసేకరణ పెట్టాలని చూడడం దారుణమన్నారు. తక్షణమే తాడి గ్రామాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పైలా కృష్ణ, జి.మాధవరావు, పైడిరాజు, రమణ, అప్పలరాజు, అప్పలాచారి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో ప్రారంభమైన కులగణన సర్వే


కులగణన సర్వే చేస్తున్న సిబ్బంది

అనకాపల్లి టౌన్, జనవరి 19: పట్టణంలో శుక్రవారం కులగణన సర్వే ప్రారంభమైంది. వేల్పులవీధిలో జరిగిన సర్వేను జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఎస్. వెంకటరమణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులగణన కార్యక్రమం ఈనెల 28వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఎవరైనా ఇళ్లల్లో లేకపోతే అటువంటి వారు కులగణన నమోదును సచివాలయాల్లో చేసుకోవడానికి ఈనెల 29 నుంచి ఫిబ్రవరి రెండో తేదీ వరకు అవకాశముందన్నారు. అనకాపల్లిలో 27 వేలు ఇళ్లు ఉన్నాయన్నారు. జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లోని 27 సచివాలయాల్లో ఉన్న 390 మంది వలంటీర్లు, 230 మంది సెక్రటరీలు సర్వే నిర్వహిస్తారన్నారు.

ఉద్యోగులకు గ్రీవెన్స్


ఉద్యోగులను అర్జీలను స్వీకరిస్తున్న ఏవో శ్రీనివాసరావు

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 19: శంకరంలోని కలెక్టరేట్ సమావేశమందిరంలో శుక్రవారం ఉద్యోగులకు గ్రీవెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎ.శ్రీనివాసరావు పాల్గొని ఉద్యోగుల నుంచి అర్జీలను స్వీకరించి, వారి గోడును ఆలకించారు. ఈ గ్రీవెన్స్‌కు ఉద్యోగుల నుంచి ఐదు అర్జీలు అందినట్టు శ్రీనివాసరావు తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

పరవాడ, జనవరి 19: సింహాద్రి ఎన్టీపీసీ సౌజన్యంతో నిర్వాసిత గ్రామాల యువతకు ఉపాధి కల్పించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు విజయవాడ సీపెట్ సంస్థ ప్రతినిధి ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వాసిత గ్రామాలకు చెందిన 18 నుంచి 35 సంవత్సరాలలోపు యువతీ,యువకులకు విజయవాడలోని పాలీమర్స్ టెక్నాలజీ నందు నైపుణ్యాభివృద్ధి శిక్షణను ఆరు నెలలు పాటు ఇచ్చి వారికి సర్టిఫికెట్ తో పాటు విశాఖపట్నం, అనంతపురం, హైద్రాబాద్, బెంగళూరు, హోసూర్, చెన్నై ప్రాంతాల్లో ప్రముఖ ప్లాస్టిక్ వాటి అనుబంధ సంస్థల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయంతోపాటు నెలకు మూడు వేల రూపాయలు స్టైఫండ్ కూడా అందజేస్తామన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ, యువకులు 9398535697 సెల్ నంబరుకు సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు.

వ్యవసాయ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ


డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తదితరులు

అనకాపల్లి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ డైరీ, క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి శుక్రవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్ సమావేశంలో జరిగిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం అనంతరం వీటిని ఆవిష్కరించారు. అనంతరం జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాల రామారావు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో రైతుల పంట రుణాలు, ఇతరత్రా అనుబంధ పంటల సాగు, రైతుల ఇబ్బందులపై చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు ఎస్.రమణ, ఎ.సూరిఅప్పారావు, జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు, సహకార బ్యాంకు మేనేజరు వర్మ, ఉద్యాన, మత్స్యశాఖ, పశుసంవర్ధక శాఖల అధికారులు హాజరయ్యారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

విశాఖపట్నం, జనవరి 19: కొమ్మాదిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి శనివారం పరీక్ష నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ కె.సంజయ్ తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. శనివారం ఉదయం 11.30 నుంచి 1.30 మధ్య పరీక్ష జరుగుతుందన్నారు. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 44 కేంద్రాల్లో ఏర్పాట్లు చేశామన్నారు. మొత్తం 8107 మంది దరఖాస్తు చేసుకున్నారని, విద్యార్థులు 10.45 నిమిషాలకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. 11.30 తరువాత వచ్చిన వారిని అనుమతించమన్నారు.

తొమ్మిది మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, జనవరి 19: దేశపాత్రునిపాలెంలోని పాన్‌షాపులో తొమ్మిది మద్యం సీసాలను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్టు సీఐ బాలసూర్యారావు తెలిపారు. పాన్‌షాపులో మద్యం విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసినట్టు చెప్పారు. ఈ దాడిలో తొమ్మిది క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, షాపు యజమాని సిహెచ్.అప్పారావుపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

'మద్యం అమ్మకాలకు పాల్పడితే చర్యలు'

అనకాపల్లి టౌన్, జనవరి 19 : మద్యం అమ్మకాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ గంగాధరరావు స్పష్టంచేశారు. శుక్రవారం ఎస్ఈబీ ఎస్ఐ కె.శ్రావణి ఆధ్వర్యంలో గతంలో మద్యం అమ్మకాలకు పాల్పడిన తొమ్మిది మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయించారు. వల్లూరుకి చెందిన ఐదుగురిని, గొలగాం, కోడూరు, కేఎస్ఆర్ పేట, గవరపాలెంనకు చెందిన ఒక్కొక్కరిని బైండోవర్ చేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బెల్టుషాపులు నిర్వహించి మద్యం అమ్మకాలు జరిపినా, సారా తయారీ, అమ్మకాలు చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటివరకు 90 మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయించామని ఎస్ఈబీ ఎస్ఐ శ్రావణి తెలిపారు.

దేవవరంలో భవిష్యత్తుకు గ్యారెంటీ



దేవవరంలో భవిష్యత్తుకు గ్యారెంటీని నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

నక్కపల్లి, జనవరి 19: మండలంలోని దేవవరంలో శుక్రవారం సాయంత్రం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు చేపట్టారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ఇంటింటా టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ దేవర సత్యనారాయణ, గింజాల లక్ష్మణరావు, కొరిమి సూర్యగణేశ్, మీసాల బాబులు, బత్తుల రమణబాబు, తాతబ్బాయి,కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో కుల గణన సర్వే ప్రారంభం

ఎలమంచిలి, జనవరి 19: మునిసిపాలిటీలోని 25 వార్డులు, 13 సచివాలయాల పరిధిలో శుక్రవారం నుంచి కుల గణన సర్వే ప్రారంభమైంది. మునిసిపాలిటీలో 124 మంది సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సర్వే ఈనెల 29 వరకూ నిర్వహిస్తామని మునిసిపల్ అధికారులు తెలిపారు. కుల గణన సర్వే నిర్వహించే సమయంలో గ్రామంలో లేని కుటుంబాలకు ఈనెల 29వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు తమ సచివాలయాల పరిధిలో సర్వే చేపట్టనున్నట్టు తెలిపారు.

తులసీరావు విగ్రహావిష్కరణకు ఏర్పాట్లు

ఎలమంచిలి, జనవరి 19: రైతు బాంధవుడు, విశాఖ డెయిరీ దివంగత చైర్మన్ ఆడారి తులసీరావు కాంస్య విగ్రహావిష్కరణ ఏర్పాట్లను మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి శుక్రవారం పర్యవేక్షించారు. తులసీరావు స్మారక ఘాట్ వద్ద ఆయన పుట్టిన రోజున (ఫిబ్రవరి 1) విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణ ఎస్ పాపినాయుడు, మునిసిపల్ అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆడారి వెంకట్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

లోక కల్యాణానికి మహాయజ్ఞం

ఎలమంచిలి, జనవరి 19 : పట్టణంలోని ధర్మవరం కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయ ఆవరణలో శుక్రవారం 7వ రోజు కూడా లోక కల్యాణార్థం మహా యజ్ఞం నిర్వహించారు. గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి రూ.25 వేలు విరాళం

సబ్బవరం,జనవరి 19: మండలంలోని రాయపుర అగ్రహారంలో శ్రీకృష్ణ ఆలయ నిర్మాణానికి పారిశ్రామికవేత్త బోకం శ్రీనివాస్ సమకూర్చిన రూ. 25 వేలు విరాళాన్ని అయన సోదరుడు బోకం స్వామినాయుడు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, సర్పంచ్ పిల్లల అప్పలనాయుడుకు శుక్రవారం అందజేశారు. విరాళాన్ని ఇచ్చిన బోకం శ్రీనివాస్, స్వామినాయడులకు సర్పంచ్, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు దుంగ ఈశ్వరరావు, ముసలయ్య, రామారావు, అచ్చిబాబు, రామునాయుడు కృతజ్ఞతలు తెలిపారు.

యూటీఎఫ్ నాయకుల నిరసన

పాయకరావుపేట, జనవరి 19 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా నాలుగు మండలాల యూటీఎఫ్ నాయకులు శుక్రవారం నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ప్లకార్డుల ప్రదర్శించి, నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు కట్టా శ్రీను, లోవరాజు, శ్రీరమాచంద్ర మూర్తి మాట్లాడుతూ ఏపీజీఎల్‌కి లోన్లు చెల్లించాలని, డీఏ ఏరియర్స్, పీఆర్సీ ఎరియర్స్, సరెండర్ లీవ్స్, ఎన్‌క్యాష్‌మెంట్ తదితర డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు వెంకటరావు, డీఆర్‌కే.శాస్త్రి, టీవీవీ.రమణ, జీవీ.గోపాల్, కేవీ.రాంబాబు, సత్యనారాయణ, వరప్రసాద్ పాల్గొన్నారు.

ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోండి

కశింకోట, జనవరి 19 : ఓటు హక్కును ప్రతి ఒక్కరూ నిర్భయంగా వినియోగించుకోవాలని ఆర్డీవో చిన్నికృష్ణ అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఓటు హక్కు వినియోగంపై డ్వాక్రా మహిళలకు ఆయన అవగాహన కల్పించారు. ఓటర్లు ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా కచ్చితంగా ఓటును వేయాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్‌నాయుడు తదితరులు ఉన్నారు.

దళిత ద్రోహి జగన్ : ప్రగడ

మునగపాక, జనవరి 19: దళితులను దగా చేసి.. ఇప్పుడు ప్రేమ ఒలకబోస్తున్న జగన్ దళిత ద్రోహి అని టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం దళితులపై జరుగుతున్న దాడులు, అరాచకాలను ఖండిస్తూ స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నల్ల రిబ్బన్‌లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్లలో దళితులపై ఆరు వేలకు పైగా దాడులు జరిగాయన్నారు. అలాగే 188 మంది దళితులను హత్య చేశారని, దళితులకు అమలు చేయాల్సిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి వారి కడుపు కొట్టారన్నారు. దళిత బిడ్డల విద్య కోసం ప్రవేశపెట్టిన ఉన్నత విదేశీ విద్యా పథకాన్ని నాలుగు సంవత్సరాలు అటకెక్కించారన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 50 వేల బ్లాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయలేదని, ఎస్సీ, ఎస్టీ చెల్లెమ్మల వివాహానికి వైఎస్ఆర్ పెళ్లి కానుక లక్ష ఇస్తానని మేనిఫెస్టోలో చెప్పి ఒక్కరికీ ఇవ్వలేదన్నారు. కోడి కత్తి కేసులో దళిత బిడ్డ శ్రీనివాసరావుకు ఇప్పటివరకూ బెయిల్ రాకుండా అడ్డుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు డొక్కా నాగభూషణం, ఆడారి మంజు, భీమరశెట్టి శ్రీనివాసరావు, దాడి ముసిలినాయుడు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి దళిత ద్రోహి అని, విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం పెట్టినంత మాత్రాన దళితులను మభ్యపెట్టలేరని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా విలియంకేరి విమర్శించారు. శుక్రవారం రాత్రి ఆయన ఆధ్వర్యంలో దళిత నాయకులు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించిన అనంతరం దళితుల పంతం.. వైసీపీ అంతం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పల్లా విలియంకేరి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పాలనలో దళితులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, పార్టీ నాయకులు చింతకాయల రాంబాబు, జూరెడ్డి ప్రసాద్, బత్తిన అచ్చిరాజు, లెక్కల గోవిందు, కశింకోట సత్తిబాబు, వేములపూడి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ప్రగడ, టీడీపీ నేతలు

అంబేడ్కర్ విగ్రహాలకు అంగన్‌వాడీల వినతిపత్రాలు

అనకాపల్లి టౌన్, జనవరి 19 : తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీల సమ్మె శుక్రవారం 39వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా శిబిరం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే నెహ్రూచౌక్‌లోని బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి అంగన్‌వాడీలు పూలమాల వేసి నివాళులు అర్పించడంతో పాటు తమ సమస్యలు పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని వేడుకున్నారు.



అనకాపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు



మునగపాకలో అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

పరవాడలో.. అంగన్‌వాడీల సమ్మె శుక్రవారం నాటికి 39వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. డిమాండ్లను పరిష్కరించడంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

మునగపాకలో.. న్యాయమైన తమ డిమాండ్లను పరిష్కరించకుండా మొండిగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు సద్బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ అంగన్‌వాడీలు శుక్రవారం అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. దీక్షా శిబిరం నుంచి అంగన్‌వాడీలు ర్యాలీగా సంతబయలు జంక్షన్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించిన అనంతరం అక్కడే నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

అచ్యుతాపురంలో.. అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలు తీర్చడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి మోటూరు శ్రీవేణి అన్నారు. అంగన్‌వాడీలకు మద్దతుగా శుక్రవారం కోటి సంతకాల సేకరణలో ఆమె పాల్గొన్నారు.

రాంబిల్లిలో.. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేస్తున్న ఆందోళన శుక్రవారానికి 39వ రోజుకు చేరుకుంది. అనంతరం అంగన్‌వాడీలతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి వినతిపత్రాన్ని అందజేశారు.

నక్కపల్లిలో.. అంగన్‌వాడీల సమ్మె శుక్రవారానికి 39వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ.. తమ ఉసురు జగన్ సర్కారుకు తగులుతుందని శాపనార్థాలు పెట్టారు.

సబ్బవరంలో.. అంగన్‌వాడీలు సమ్మెలో భాగంగా శుక్రవారం 39వ రోజు మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమకు న్యాయం చేయకుంటే రానున్న ఎన్నికల్లో ప్రభుత్వానికి బుద్ధి చెబుతామన్నారు.

అభివృద్ధికి ఆమడ దూరం..

... 5వ పేజీ తరువాయి

ఉన్నప్పటికీ, స్థానిక వైసీపీ నేతలు తమ పంచాయతీలో ప్రభుత్వ స్థలం లేదని చెప్పడంతో అధికారులు జగనన్న కాలనీ మంజూరు చేయలేదు. దీంతో సుమారు 50 మంది నిరుపేదలు స్థలాలు, పక్కా ఇళ్ల మంజూరుకు నోచుకోలేదు.

కలగానే ఎర్రిగెడ్డపై కాజ్‌వే నిర్మాణం

రాయపురాజుపేట నుంచి చోడవరం, గోవాడ వెళ్లేందుకు రోడ్డు నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ మూడేళ్ల క్రితం పూర్తయినప్పటికీ ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి వెళ్లే దారిలో ఎర్రిగెడ్డ మీద వున్న కాజ్‌వే నాలుగేళ్ల క్రితం భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. కొత్త కాజ్‌వే నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. కానీ నిర్మాణం చేపట్టలేదు.

ఉత్సవ విగ్రహాలుగా సర్పంచులు

బొడ్డేడ రామునాయుడు, సర్పంచ్, రాయపురాజుపేట

వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మా పంచాయతీలో జరిగిన అభివృద్ధి శూన్యం. రాజకీయ దురుద్దేశంతో మా పంచాయతీకి జగనన్న కాలనీ మంజూరు చేయలేదు. పంచాయతీ ఖాతాల్లో వున్న నిధులను కరెంటు బిల్లుల బకాయిల పేరుతో ప్రభుత్వం తీసేసుకుంది. పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించడానికి డబ్బులు లేవు. రూ.8 లక్షలతో డ్రైనేజీ కాలువలు నిర్మించగా.. ఇంతవరకు బిల్లు రాలేదు. వైసీపీ ప్రభుత్వం పంచాయతీల నిధులు తీసేసుకుని సర్పంచులను ఉత్సవవిగ్రహాలుగా మార్చేసింది.

తాడి నెత్తిన మరో కుంపటి

... 5వ పేజీ తరువాయి

ఘన వ్యర్థాలను తాడి సమీపంలో ల్యాండ్‌ఫిల్ ప్లాంట్‌కు తరలిస్తుండడంతో ప్రస్తుతం పెద్ద కొండలా తయారైంది. ల్యాండ్ ఫిల్ ప్లాంట్‌కు ప్రభుత్వం కేటాయించిన స్థలానికి ఆనుకుని మరికొంత భూమి ఆక్రమించుకుని ఘనవ్యర్థాలు నిల్వ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ల్యాండ్ ఫిల్ ప్లాంట్లు నిర్వహణ ప్రమాణాలకు అనుగుణంగా లేని కారణంగా తాడితోపాటు పరిసర గ్రామాలు కాలుష్యం బారిన పడ్డాయి. తాడి గ్రామం అయితే ఇటు ల్యాండ్ ఫిల్ ప్లాంటు, అటు ఫార్మాసిటీ నుంచి వచ్చే కాలుష్యంతో ఉక్కిరిబిక్కిర వుతుంది. గ్రామం చుట్టూ భూగర్భ జలాలు ఎప్పుడో కలుషితమయ్యాయి. భూగర్భ జలాలు వినియోగించరాదని ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన నిపుణులు హెచ్చ రించారు. తాడి గ్రామాన్ని తరలించాలని ఏళ్ల తరబడి గ్రామస్థులు పోరాటం చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో గ్రామానికి మరోవైపుగా 50 ఎకరాల్లో కొత్తగా ఘన వ్యర్థాల ప్లాంటు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. ఇందుకోసం ఈనెల 30న కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించ నున్నది. మరో ఘన వ్యర్థాల నిల్వ ప్లాంటు ఏర్పాటు చేయవద్దని గ్రామస్థులు ముక్తకంఠంతో కోరుతున్నారు. గ్రామస్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తాడి వద్ద ఘన వ్యర్థాల నిల్వ ప్లాంటు ఏర్పాటుచేయవద్దని పరవాడ సీపీఎం నాయకుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గ్రామాన్ని తరలించకుండా కొత్తగా ఘన వ్యర్థాల నిల్వ ప్లాంటు ఏర్పాటుచేయడం దారుణమన్నారు. తాడి గ్రామాన్ని తరలిస్తామని 2022 ఏప్రిల్ 28న సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో జగనన్న కాలనీ శంకుస్థాపన సందర్భంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలు కాలేదు సరికదా తిరిగి గ్రామం నెత్తిన మరో కుంపటి పెడుతున్నారని ఆరోపించారు.

ఓటమి భయంతోనే వైసీపీ నేతల దుష్ప్రచారం

» మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద



విలేకరులతో మాట్లాడుతున్న పీలా గోవింద

తుమ్మపాల, జనవరి 19: రానున్న ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే తనపై వైసీపీ నేతలు దుష్ప్రచారానికి పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ ఆరోపించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంతవరకు 8038461027 నంబరు నుంచి మూడు వేల మందికిపైగా టీడీపీ కార్యకర్తలకు ఫేక్ ఫోన్‌కాల్స్ చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో పీలా గోవిందకు టికెట్ లేదని, పార్టీ నాయకత్వం ప్రాధాన్యతనివ్వడం లేదంటూ ఫోన్ కాల్స్ చేస్తూ కార్యకర్తలను ఆందోళనకు గురి చేస్తున్నారని చెప్పారు. దీనిపై సైబర్ క్రైమ్‌కు ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు చేయడంతోపాటు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశామన్నారు. క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పచ్చికూర రాము, బొద్దపు ప్రసాద్, పోలారపు త్రినాథ్, తలారి కాశీనాయుడు, నారిపిన్ని చంద్రశేఖర్, పిట్ల రాజు, దాడి జగన్,తదితరులు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి, మంచు

కోటవురట్ల, జనవరి 19: మండలంలో పలు గ్రామాల్లో మూడు రోజులుగా చలి తీవ్రత మళ్లీ పెరిగింది. అలాగే మంచు విపరీతంగా కురుస్తోంది. పగటి ఉష్ణోగ్రతలు కూడా బాగా తగ్గిపోయాయి. పొగమంచుతోపాటు చలి తీవ్రతతో ఉదయం 9.గంటల వరకు చలిగాలులు వీస్తూనే ఉన్నాయి. చలితీవ్రతకు పిల్లలు, వృద్ధులు జ్వరం, జలుబు వంటి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం ఉదయం నాలుగు గంటల నుంచి ఉదయం 9గంటల వరకు మంచు దట్టంగా కురిసింది.

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయండి : ఎంపీపీ

సబ్బవరం, జనవరి 19 : మండలంలో పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీపీ బోకం సూర్యకుమారి సూచించారు. స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన సమావేశంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులతో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. అనంతరం చెత్త బకెట్లను పంచాయతీ కార్యదర్శిలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్‌నాయుడు, ఈవోపీఆర్‌డీ మహేశ్, మోపాడ అప్పారావు, సర్పంచులు పాల్గొన్నారు.

దాడిని కలిసిన నూతనగుంటపాలెం నేతలు



మాజీ మంత్రి దాడిని కలిసిన నూతనగుంటపాలెం నేతలు

అనకాపల్లిటౌన్, జనవరి 19 : స్థానిక లక్ష్మీనారాయణనగర్‌లోని డీవీఆర్ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం మాజీ మంత్రి దాడి వీరభద్రరావును కశింకోట మండలం నూతనగుంటపాలెం గ్రామానికి చెందిన పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వీరభద్రరావు వారితో కొంతసేపు పలు విషయాలపై ముచ్చటించారు.

ఉప్పుమడులకు రోడ్డు వేయాలని ఆందోళన



ఉప్పుటేరు వద్ద ఆందోళన చేస్తున్న దళితులు

అచ్యుతాపురం, జనవరి 19: తమ ఉప్పుమడులకు సముద్రపు నీరు వచ్చేలా రోడ్డు నిర్మించాలని పూడిమడక దళితులు శుక్రవారం ఉప్పుటేరు వద్ద ఆందోళన చేపట్టారు. పూడిమడక సముద్రం ఏటిమొగ నుంచి ఉప్పుటేరు ద్వారా వచ్చిన నీటితో 80 ఎకరాల్లో 56 దళిత కుటుంబాలు ఉప్పు పండించి జీవనం సాగిస్తున్నాయి. అయితే పూడిమడకలో జెట్టీ నిర్మాణానికి రోడ్డుని ఉప్పుటేరు కప్పి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఉప్పుటేరు కప్పేయడం వల్ల తమ ఉప్పు మడులకు నీరు అందదని, అందువల్ల గళ్లీలకు నీరు వచ్చే రోడ్డు నిర్మించాలని వీరు ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనలో సమ్మింగి లక్ష్మణ, ఈరుగుల మహలక్ష్మి, రేవిడి ఆనందరావు, సత్తాడ బాబూరావు, అప్పారావు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై అప్రమత్తంగా ఉండండి : ప్రగడ

మునగపాక, జనవరి 19 : ఓటర్ల జాబితా విషయంలో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం ఇక్కడ జరిగిన పార్టీ మండల నేతలు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో జగన్ ఓటర్ల కార్డులను ముద్రించి దొడ్డి దారిన గద్దెనెక్కిన విషయాన్ని ఎన్నికల కమిషన్ బట్టబయలు చేసిందన్నారు. అన్ని గ్రామాల్లో ఇటువంటి అక్రమాలను గుర్తించాలన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, నాయకులు భీమరశెట్టి శ్రీనివాసరావు, దాడి ముసిలినాయుడు, పెంటకోట విజయ్, మొల్లేటి సత్యనారాయణ, కె.వీరరాజశేఖర్,డొక్కా నాగభూషణం పాల్గొన్నారు.

జానకయ్యపేటలో ఘనంగా తీర్థం

నక్కపల్లి, జనవరి 19: మండలంలోని జానకయ్యపేటలో శుక్రవారం తీర్థం సందడి నెలకొంది. ఈ సందర్భంగా గ్రామంలోని రామాలయం, కృష్ణాలయం, ఇతర ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గ్రామంలో అనేక స్టాల్స్ ఏర్పాటయ్యాయి. సాయంత్రం నుంచి పురవీధులు జనాలతో నిండిపోయాయి.

టీడీపీ బ్యాడ్జీల పంపిణీ

అచ్యుతాపురం, జనవరి 19: టీడీపీ అభివృద్ధి కోసం సోషల్ మీడియాలో చురుకుగా పనిచేస్తున్న పది మందికి పార్టీ బ్యాడ్జీలను పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో దొడ్డి శ్రీనివాసరావు, పతివాడ చిన్నయ్యనాయుడు, దాడి ముసిలి నాయుడు, ఆడారి మంజు, పెంటకోట విజయ్, బి.శ్రీను, రాజశేఖర్ పాల్గొన్నారు.

జగనన్న బీమా పంపిణీ

అచ్యుతాపురం, జనవరి 19: నునపర్తిలో అనారోగ్యంతో మృతిచెందిన గుంటపల్లి ముత్యాలరావు భార్య రమణమ్మకు జగనన్న బీమా కింద రూ.లక్ష చెక్కును శుక్రవారం అందజేశామని నునపర్తి సర్పంచ్ చుక్క అనూరాధ తెలిపారు. రెడ్డి నరసింహనాయుడు, యాక అప్పలరాజు, పేరునాయుడు పాల్గొన్నారు.

న్యాయమూర్తికి సత్కారం



న్యాయమూర్తి శివకిరణ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, జనవరి 19 : బదిలీపై వెళుతున్న 13వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎం.శివకిరణ్‌ను శుక్రవారం బార్ అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. కోర్టు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మేజిస్ట్రేట్ శివకిరణ్‌ను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయి లక్ష్మణ ఆధ్వర్యంలో జిల్లా న్యాయమూర్తి ఎం.శ్రీవిద్య, న్యాయమూర్తులు గంగరాజు, ప్రదీప, బీవీ విజయలక్ష్మి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కేవీఆర్ నాయుడు, ఎంజేవీఎన్ కుమార్, కేవీఎస్ శ్రీనివాస్, సూరా శ్రీనివాస్, వి.రాజశేఖర్, ఏపీపీ మృణాలిని, ప్రభుత్వ న్యాయవాది నంద్ పాల్గొన్నారు.

రంగవల్లులతో ఎంతో ఆరోగ్యం : గాయత్రీదేవి

నక్కపల్లి, జనవరి 19: ప్రతీ ఇంటి ముంగిట ముగ్గులు వేయడం కేవలం అందం కోసమే కాదని, ఎన్నో ఆరోగ్య సూత్రాలు కూడా దాగివున్నాయని ప్రముఖ తెలుగు పండిట్ డాక్టర్ గాయత్రీదేవి అన్నారు. మండలంలోని ఉపమాక రామాలయం వద్ద శుక్రవారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాయత్రీదేవి మాట్లాడుతూ వరిపిండితో ముగ్గులు వేయడం వల్ల చీమలు, ఇతర జీవులకు వరి పిండి ఆహారంగా మారుతుందని చెప్పారు. ముఖ్యంగా మహిళలకు చక్కని వ్యాయామం అవుతుందన్నారు. అనంతరం విజేతలకు ఎంపీటీసీ సభ్యులు కొల్లాటి బుజ్జీ పార్వతి, కొప్పిశెట్టి బుజ్జి, వరహాలరావు, కనకారావు, పొన్నాడ నారాయణరావు తదితరులు బహుమతులు అందజేశారు.

మొక్కుబడిగా 'ఆడుదాం ఆంధ్ర'

» క్రికెట్ కెప్టెన్ గొల్లపల్లి నాగు

పాయకరావుపేట, జనవరి 19 : పట్టణంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని అధికారులు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారని పట్టణానికి చెందిన సచివాలయం-1 క్రికెట్ టీం కెప్టెన్ గొల్లపల్లి నాగు ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అధికారులు ముందుగా ఎటువంటి షెడ్యూల్ తెలియజేయకుండా శుక్రవారం ఉదయం 9 గంటలకు మ్యాచ్ ఆడాలని గంట ముందు సమాచారం ఇచ్చారన్నారు. అప్పటికప్పుడు చెప్పడంతో ఉన్న కొద్దిమంది టీం సభ్యులతోపాటు మరికొంతమందిని బతిమలాడుకుని టీంను ఏర్పాటుచేసుకుని మ్యాచ్‌కి సిద్ధమయ్యామన్నారు. ఇష్టానుసారంగా షెడ్యూల్ వేసి ఒకే రోజు ఒక టీంతో వరుసగా మూడు మ్యాచ్‌లు ఆడించడం క్రీడా నిబంధనలకు విరుద్ధమన్నారు.

వెంకటాపురంలో వికసిత భారత్ సంకల్ప యాత్ర

ఎస్.రాయవరం, జనవరి 19: మండలంలోని వెంకటాపురం, ఉప్పరాపల్లి గ్రామాల్లో శుక్రవారం వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి డాక్టర్ మహేష్, ఎంపీడీవో ఎస్‌వీ రామచంద్రమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొని కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. కార్యక్రమాల్లో సర్వసిద్ధి వైద్యాధికారిణి డాక్టర్ వాసంతి, సర్పంచులు పాల్గొన్నారు.

బీసీ సభకు ఏర్పాట్లు పరిశీలన

పాయకరావుపేట రూరల్ 19 : మండలంలోని పాల్మన్‌పేటంలో శనివారం నిర్వహించనున్న టీడీపీ జయహో బీసీ సభను విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు కోరారు. శుక్రవారం టీడీపీ నాయకులతో కలిసి పాల్మన్‌పేట వచ్చిన ఆయన రాజయ్యపేటలో నిర్వహించనున్న జయహో బీసీ సభ ఏర్పాట్లపై స్థానిక పార్టీ నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభకు తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కంకిపాటి వెంకటేశ్వరరావు, బొంది కాశీవిశ్వనాథం, చింతకాయల రాం బాబు, పిర్ల కళ్యాణి పాల్గొన్నారు.

కులగణన సర్వే పక్కాగా చేపట్టాలి

పరవాడ, జనవరి 19 : కులగణన సర్వే పక్కాగా చేపట్టాలని ఎంపీడీవో వి. హేమసుందర రావు సూచించారు. పరవాడ సచివాలయంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 28వ తేదీ సాయంత్రం నాటికి కులగణన సర్వే పూర్తి చేయాలన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి వివరాలను పక్కాగా నమోదు చేసుకోవాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో నోడల్ అధికారి జి. అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు : సీఐ

కశింకోట, జనవరి 19 : మండలంలోని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ కె.వినోద్‌బాబు హెచ్చరించారు. గ్రామాల్లో జరుగుతున్న తీర్థమహోత్సవాల్లో కోడిపందాలు, గుండాటలు గాని నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కాగా కశింకోట ప్రధాన కూడలి వద్ద సిగ్నల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నామన్నారు. గ్రామాల్లో నేరాల నియంత్రణకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి

▸▸ యూటీఎఫ్ డివిజన్ నాయకుడు వరప్రసాద్ డిమాండ్

▸▸ ఉపాధ్యాయులతో కలిసి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

నర్సీపట్నం, జనవరి 19 : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ డివిజన్ నాయకుడు జంగా వరప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం నల్ల రిబ్బన్లు ధరించి ఇక్కడి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద పలువురు ఉపాధ్యాయులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ అంశంపై స్పందించకుంటే జిల్లా కేంద్రాల వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు గడ్డి నాయుడు, చిట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కోడి కత్తి కేసులో శ్రీనివాస్‌కు న్యాయం చేయాలి

▸▸ కె.కోటపాడులో టీడీపీ, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన



అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ, దళిత సంఘాల నాయకుల నినాదాలు

కె.కోటపాడు, జనవరి 19 : కోడి కత్తి కేసులో నిందితుడు శ్రీనివాస్‌కు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం ఇక్కడ టీడీపీ, దళిత సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. ఇందులో భాగంగా అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా టీడీపీ మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్ మాట్లాడుతూ దళితుడైన శ్రీనివాస్‌ను శాశ్వతంగా జైలులో ఉంచేందుకు కుట్రలు పన్నారని ఆరోపించారు. ఇక్కడ దళితుడ్ని జైలుపాలు చేసి, అక్కడ అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ చేయడం రాజకీయ ఎత్తుగడగా అభిప్రాయపడ్డారు. దళిత సంఘం నాయకుడు భూపతి అప్పలరాజు మాట్లాడుతూ శ్రీనివాస్ తల్లిదండ్రుల వేడుకోలును సీఎం జగన్ చెవిన వేసుకోవడం లేదన్నారు. స్వార్థ రాజకీయాల కోసం దళితులను వాడుకుంటున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కశిరెడ్డి అప్పలనాయుడు, సత్యవతి, జూరెడ్డి రాము, కన్నూరు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'జల్‌జీవన్' పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

▸▸ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శివానందకుమార్

మాడుగుల, జనవరి 19 : జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా చేపడుతున్న ఇంటింటికీ కుళాయి కనెక్షన్ పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఆర్‌డబ్ల్యూఎస్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శివానందకుమార్ హెచ్చరించారు. మాడుగులలో జరుగుతున్న రక్షిత నీటి పథకం ట్యాంకు నిర్మాణం, కుళాయి పనులను శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. పనులను సకాలంలో పూర్తిచేయాలన్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ డీఈ తిరుపతినాయుడు, మాడుగుల డీఈ అల్లూ సూర్యనారాయణ, జేఈ కార్తీకనాయుడు, మాడుగుల ఏఈ సీహెచ్‌వీ నరసింహారావుతో పాటు పలువురు స్థానిక అధికారులు పాల్గొన్నారు.

తాడి నెత్తిన మరో కుంపటి

... 5వ పేజీ తరువాయి

ఘన వ్యర్థాలను తాడి సమీపంలో ల్యాండ్‌ఫిల్ ప్లాంట్‌కు తరలిస్తుండడంతో ప్రస్తుతం పెద్ద కొండలా తయారైంది. ల్యాండ్ ఫిల్ ప్లాంట్‌కు ప్రభుత్వం కేటాయించిన స్థలానికి ఆనుకుని మరికొంత భూమి ఆక్రమించుకుని ఘనవ్యర్థాలు నిల్వ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ల్యాండ్ ఫిల్ ప్లాంట్లు నిర్వహణ ప్రమాణాలకు అనుగుణంగా లేని కారణంగా తాడితోపాటు పరిసర గ్రామాలు కాలుష్యం బారిన పడ్డాయి. తాడి గ్రామం అయితే ఇటు ల్యాండ్ ఫిల్ ప్లాంటు, అటు ఫార్మాసిటీ నుంచి వచ్చే కాలు ష్యంతో ఉక్కిరిబిక్కిర వుతుంది. గ్రామం చుట్టూ భూగర్భ జలాలు ఎప్పుడో కలు షితమయ్యాయి. భూగర్భ జలాలు వినియోగించరాదని ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన నిపుణులు హెచ్చ రించారు. తాడి గ్రామాన్ని తరలించాలని ఏళ్ల తరబడి గ్రామస్థులు పోరాటం చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో గ్రామానికి మరోవైపుగా 50 ఎకరాల్లో కొత్తగా ఘన వ్యర్థాల ప్లాంటు ఏర్పాటుకు ప్రభు త్వం అనుమతించింది. ఇందుకోసం ఈనెల 30న కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించ నున్నది. మరో ఘన వ్యర్థాల నిల్వ ప్లాంటు ఏర్పాటు చేయవద్దని గ్రామస్థులు ముక్తకంఠంతో కోరుతున్నారు. గ్రామస్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తాడి వద్ద ఘన వ్యర్థాల నిల్వ ప్లాంటు ఏర్పాటుచేయవద్దని పరవాడ సీపీఎం నాయకుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గ్రామాన్ని తరలించకుండా కొత్తగా ఘన వ్యర్థాల నిల్వ ప్లాంటు ఏర్పాటుచేయడం దారుణమన్నారు. తాడి గ్రామాన్ని తరలిస్తామని 2022 ఏప్రిల్ 28న సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారంలో జగనన్న కాలనీ శంకుస్థాపన సందర్భంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలు కాలేదు సరికదా తిరిగి గ్రామం నెత్తిన మరో కుంపటి పెడుతున్నారని ఆరోపించారు.

అభివృద్ధికి ఆమడ దూరం..



ఎర్రిగెడ్డపై కాజ్‌వే నిర్మించాల్సిన ప్రదేశం ఇదే

... 5వ పేజీ తరువాయి

ఉన్నప్పటికీ, స్థానిక వైసీపీ నేతలు తమ పంచాయతీలో ప్రభుత్వ స్థలం లేదని చెప్పడంతో అధికారులు జగనన్న కాలనీ మంజూరు చేయలేదు. దీంతో సుమారు 50 మంది నిరుపేదలు స్థలాలు, పక్కా ఇళ్ల మంజూరుకు నోచుకోలేదు.

కలగానే ఎర్రిగెడ్డపై కాజ్‌వే నిర్మాణం

రాయపురాజుపేట నుంచి చోడవరం, గోవాడ వెళ్లేందుకు రోడ్డు నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ మూడేళ్ల క్రితం పూర్తయినప్పటికీ ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు. గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి వెళ్లే దారిలో ఎర్రిగెడ్డ మీద వున్న కాజ్‌వే నాలుగేళ్ల క్రితం భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. కొత్త కాజ్‌వే నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. కానీ ఇంతవరకు నిర్మాణం చేపట్టలేదు.

ఉత్సవ విగ్రహాలుగా సర్పంచులు



వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మా పంచాయతీలో జరిగిన అభివృద్ధి శూన్యం. రాజకీయ దురుద్దేశంతో మా పంచాయతీకి జగనన్న కాలనీ మంజూరు చేయలేదు. పంచాయతీ ఖాతాల్లో వున్న నిధులను కరెంటు బిల్లుల బకాయిల పేరుతో ప్రభుత్వం తీసేసుకుంది. పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించడానికి డబ్బులు లేవు. రూ.8 లక్షలతో డ్రైనేజీ కాలువలు నిర్మించగా ఇంతవరకు బిల్లు రాలేదు. వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీల నిధులు, విధులు తీసేసుకుని సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చేసింది.

బొడ్డేడ రామునాయుడు, సర్పంచ్, రాయపురాజుపేట



రావికమతంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద అంగన్‌వాడీల ధర్నా



నర్సీపట్నంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిని సమర్పిస్తున్న దృశ్యం



చీడికాడలో..

ప్రభుత్వం మెట్టు దిగే వరకు పట్టు

▸▸ అంగన్‌వాడీలు స్పష్టీకరణ ▸▸ పలుచోట్ల అంబేడ్కర్ విగ్రహాలకు వినతులు సమర్పణ

దేవరాపల్లి, జనవరి 19 : సమస్యలు పరిష్కరించాలని దీర్ఘకాలంగా సమ్మె చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడంపై అంగన్‌వాడీలు శుక్రవారం ఇక్కడ ఆవేదన వ్యక్తం చేశారు. ఆకులో మట్టి పోసుకొని తింటూ వినూత్నంగా నిరసన తెలిపారు. కె.కోటపాడు, దేవరాపల్లి మండలాలకు చెందిన అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో ఇక్కడకు చేరుకుని 'ప్రతి అక్కాచెల్లెమ్మకు న్యాయం చేస్తానన్న జగనన్నా.. ఎందుకు మౌనం పాటిస్తున్నారు..' అంటూ నినాదాలు చేశారు. 39 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా స్పందించకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరి ఆందోళనకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, గాడి ప్రసాద్ సంఘీభావం తెలిపారు.

నర్సీపట్నం : అంగన్‌వాడీల సమస్యలపై సీఎం జగన్ తక్షణమే స్పందించాలని సీఐటీయూ నాయకుడు చిరంజీవి డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని అబీద్ సెంటర్‌లో గల అంబేడ్కర్ విగ్రహానికి ఆయనతో పాటు ఐద్వా నాయకురాళ్లు గౌరీ, సామ్రాజ్యం, మహాలక్ష్మి, కృష్ణవేణి, రమణమ్మ తదితరులు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలకు ముందు పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ కంటే ఇక్కడ ఎక్కువ జీతం, సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం గ్రాడ్యూటీ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



దేవరాపల్లిలో ఆకులో మట్టి పోసుకొని తింటూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

గొలుగొండ : సమస్యల పరిష్కారానికి సమ్మె చేపడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వం బెదిరించడం సరికాదని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి అన్నారు. నాతవరం, గొలుగొండ మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు ఇక్కడ చేపడుతున్న దీక్షలు శుక్రవారం 39వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సదరు శిబిరాన్ని ఆమెతో పాటు ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు ఎల్.గౌరి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు సందర్శించారు. అనంతరం దుర్గారాణి మాట్లాడుతూ దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా ఆందోళనలు చేపడుతున్న అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం, షోకాజ్ నోటీసులు జారీ చేయడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి వాటికి భయపడేది లేదని, ప్రభుత్వం దిగివచ్చే వరకు ఆందోళనను కొనసాగిస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు మంగతాయారు. ఆర్.వెంకటలక్ష్మి, భ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

రావికమతం : సమస్యలపై దీర్ఘకాలంగా ఆందోళన చేపడుతున్న అంగన్‌వాడీలు శుక్రవారం రావికమతంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు లీడర్ సత్యవేణి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంత భయపెట్టినా తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించే వరకు తాము ఆందోళనను విరమించేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు నింగినంటుతున్న తరుణంలో అరకొర వేతనాలతో తాము ఎలా బ్రతకాలని సత్యవేణి ప్రశ్నించారు.

బుచ్చెయ్యపేట : కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో అంగన్‌వాడీ కార్యకర్త శాంతకుమారి శుక్రవారం నిరసన శిబిరానికి వెళుతూ గుండెపోటుతో మృతి చెందడంపై బుచ్చెయ్యపేటలోని దీక్షా శిబిరంలో అంగన్‌వాడీలు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఉద్యోగం తీసేస్తుందన్న మనస్తాపంతో శాంతకుమారి గుండెపోటుకు గురై మృతి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీల సంఘం నాయకురాళ్లు ఎలిశెట్టి అమ్మాజీ, కోవెల వెంకటలక్ష్మి, ఆది వరలక్ష్మిలు పాల్గొన్నారు.

చీడికాడ: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రాకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, మండల కార్యదర్శి రొంగలి దేముడునాయుడు హెచ్చరించారు. అంగన్‌వాడీల దీక్షా శిబిరాన్ని శుక్రవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారంతా అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపి, డిమాండ్లపై నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకురాళ్లు ఎం.జానకి, రాజులమ్మ, రామలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జగన్ అరాచక పాలన అంతమే అందరి లక్ష్యం కావాలి

▸▸ ఆత్మీయ సమ్మేళనాల్లో మునిసిపల్ కౌన్సిలర్లు పద్మావతి, రాజేశ్

▸▸ పీపీ అగ్రహారంలో పలు కుటుంబాలు టీడీపీలో చేరిక



టీడీపీలో చేరుతున్న వారికి కండువాలు కప్పుతున్న పద్మావతి



జోగంపేటలో మాట్లాడుతున్న చింతకాయల రాజేశ్

మాకవరపాలెం, జనవరి 19 : వైసీపీ అరాచక పాలనపై ప్రజలు విసుగు చెందారని, ఈ పరిస్థితుల్లో రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు వంటి సమర్థ నాయకుడి కోసం అంతా ఎదురు చూస్తున్నారని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు సతీమణి, నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల పద్మావతి అన్నారు. మండలంలోని పీపీ అగ్రహారంలో శుక్రవారం నిర్వహించిన పార్టీ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. రోజు రోజుకు టీడీపీకి ప్రజాదరణ మరింత పెరుగుతోందన్నారు. జగన్ పాలనలో ఎక్కడా అభివృద్ధి కానరాలేదన్నారు. ఎన్నికల ముందు ఆచరణకు నోచుకోని హామీలు ఇచ్చి ప్రజలను మోసగించారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించడమే అందరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలోని సుమారు పది కుటుంబాలకు చెందిన వారు టీడీపీలో చేరడంతో వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆర్.వై. పాత్రుడు, సీనియర్ నాయకులు బొంతు రాజబాబు, బొంతు శ్రీను, శేషుకుమార్, నర్ల సత్యనారాయణ, జోగిపాత్రుడు గోవింద, చిరంజీవి, చినబాబు, పాశపు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జోగంపేటలో...

గొలుగొండ : రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయమే అందరి లక్ష్యం కావాలని మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు తనయుడు, మునిసిపల్ కౌన్సిలర్ చింకాయల రాజేశ్ పిలుపునిచ్చారు. జోగంపేటలో శుక్రవారం ఏర్పాటైన యువత ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. ఏ గ్రామంలో చూసినా టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధే కనిపిస్తుందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక గొప్పలు చెప్పడమే తప్ప, అభివృద్ధి కానరావడం లేదని ఆరోపించారు. ప్రధానంగా సాగునీటి రంగాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో రైతులకు కష్టాలు అధికమయ్యాయన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే యువతకు, మహిళలకు, రైతులకు పెద్దపీట వేసేలా పార్టీ అధినేత చంద్రబాబు ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, మాజీ సర్పంచ్‌లు సుర్ల బాబ్జి, కొల్లాన కొండలరావు, బెల్లపు కొండలరావు, నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి పైల ప్రసాద్, నాయకులు అదపురెడ్డి గోపీ తదితరులు పాల్గొన్నారు.

చినపాచిలలో రాముని అక్షింతలు పంపిణీ



అక్షింతలతో గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

రావికమతం, జనవరి 19 : అయోధ్య రాముని అక్షింతల పంపిణీ కార్యక్రమం చినపాచిల గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడి లక్ష్మీసత్యనారాయణ, సీతారామాలయం నుంచి గ్రామస్థులు, ధార్మిక సంఘాల సభ్యులు భారీ ర్యాలీగా ఇంటింటికీ వెళ్లి స్వామివారి అక్షింతలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ఆరవెల్లి వెంకట గోపాలాచార్యులు, పవన్‌కుమార్, కొమార ప్రసాద్, సాసుబిల్లి సత్యారావు, జనపాల వెంకట్రావు, సాసుబిల్లి మహేష్, చినబాబు, సత్యనారాయణ, బాబూరావుతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

కేజేపురంలో ఘనంగా రాములవారి తీర్థం

మాడుగుల రూరల్, జనవరి 19 : మండలంలోని కేజేపురంలో శుక్రవారం రాములవారి తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి స్వామి వారికి విశేష పూజలు జరిపారు. సాయంత్రం వేడుకను తిలకించేందుకు గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాలవారు తరలిరావడంతో కోలాహల వాతవరణం నెలకొంది. ఈ సందర్భంగా ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రణాళిక ద్వారా పంచాయతీల అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజేశ్వరి

దేవరాపల్లి, జనవరి 19 : రానున్న ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి సూచించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులకు ఏర్పాటైన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టి కృషితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఈ దిశగా అంతా ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బలక్ష్మి, కార్యాలయ సూపరిండెంట్ జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై వినతి



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ధర్మశ్రీ తదితరులు

చోడవరం, జనవరి 19 : రాష్ట్రంలో విద్యుత్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారమయ్యేలా చూడాలని విప్ ధర్మశ్రీకి యునైటెడ్ ఎలక్ట్రికల్ ఎంప్లాయీస్ యూనియన్ రీజనల్ అధ్యక్షుడు ప్రేమచంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం విద్యుత్ ఉద్యోగుల డెయిరీ, క్యాలెండర్ ఆవి ష్కరణను శుక్రవారం ఇక్కడ ధర్మశ్రీ చేతులమీదుగా నిర్వహించి మాట్లాడారు. విద్యుత్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, ఉద్యోగులకు పాత పెన్షన్ సౌకర్యం వర్తించేలా చూడాలని కోరారు. విద్యుత్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేపాడ సత్యనారాయణ, సంఘం డివిజన్ అధ్యక్షుడు నాగప్పారావు, నాయకులు జీవీ సత్యనారాయణ, బి.కొండలరావు, రవిప్రసాద్, టీటీ నాయుడు, కె.గోపి, కె.సుబ్బారావు పాల్గొన్నారు

'ఆరోగ్య సురక్షతో పేదలకు మెరుగైన వైద్యం'



మహిళకు మందులు అందజేస్తున్న డీఎంహెచ్‌వో

కె.కోటపాడు, జనవరి 19 : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న శిబిరాల ద్వారా పేదలకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్‌కుమార్ అన్నారు. కె.కోటపాడులో శుక్రవారం ఏర్పాటైన వైద్య శిబిరాన్ని పరిశీలించి మాట్లాడారు. అనంతరం వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారిణి నాగలక్ష్మి, ఎంపీడీవో ప్రసాదరావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంట : ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా నిర్వహించే వైద్య శిబిరాలను అంతా సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వీరజ్యోతి సూచించారు. శుక్రవారం కొవ్వూరులో ఏర్పాటైన శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. ఎంపీడీవో విజయ్‌కుమార్, వైద్యాధికారులు అనూష, ధనలక్ష్మి, సర్పంచ్ కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

'చెరకు సాగుకు మరింత ప్రోత్సహించండి'

బుచ్చెయ్యపేట, జనవరి 19 : గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి చెరకు సరఫరా చేసే రైతులకు బకాయిలు, కార్మికుల జీతాల నిమిత్తం ప్రభుత్వం నిధులు విడుదల చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. బుచ్చెయ్యపేట, వడ్డాది చెరకు కాటాల వద్ద శుక్రవారం వారంతా సమావేశమయ్యారు. చెరకు పంట సాగుకు ప్రభుత్వం మరింత ప్రోత్సాహం అందించాల్సిందిగా కోరారు. నిధుల విడుదలకు కృషి చేసిన విప్ ధర్మశ్రీకి కృతజ్ఞతలు తెలిపారు. జడ్పీటీసీ దొండా రాంబాబు, దొండా నారాయణమూర్తి, పెదిరెడ్ల మాణిక్యం, సింయాద్రి తాతబాబు, సుంకర గాంధీ, జోగా కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో దళితులకు దగా : జనసేన నేత రాజు



సదస్సులో మాట్లాడుతున్న జనసేన నాయకుడు రాజు

రావికమతం, జనవరి 19 : దళితుల ఓట్లతో గద్దెనెక్కిన జగన్, ఈ నాలుగున్నరేళ్లలో వారిని అన్ని విధాలుగా మోసగించారని జనసేన చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు విమర్శించారు. శుక్రవారం కొత్తకోటలో పార్టీ ఆధ్వర్యంలో దళిత సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ దళితులకు అమలవుతున్న పథకాలన్నింటికీ కోతపెట్టి, కొత్త పథకాల పేరుతో అందరికీ టోపీ పెట్టారన్నారు. రాజ్యాంగబద్ధంగా దళితులకు దక్కవలసిన సబ్‌ప్లాన్ నిధులను నిలిపివేశారని, వారికి అమలు చేయవలసిన సంక్షేమ పథకాలకు కూడా గండికొట్టారన్నారు. రానున్న జనసేన, టీడీపీ పాలనలో దళితులకు చక్కని గుర్తింపు లభిస్తుందని భరోసా ఇచ్చారు. కొత్తకోటలో క్రియాశీలకంగా పనిచేస్తూ చనిపోయిన ఇద్దరు పార్టీ కార్యకర్తల కుటుంబాలకు రాజు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మైచర్ల నాయుడు, బలిజ మహారాజు, డీఎస్ నాయుడు, గూనూరు మూలునాయుడు, కర్రి రమేష్, ఎడ్ల రామ్మూర్తి, గుండు గణేష్, దాసరి చిన్నబ్బాయి, లొట్ల శివ, చింతల కిశోర్, జనసేన వీరమహిళలు దళితులు పాల్గొన్నారు.

'సీఎం సభను విజయవంతం చేయండి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేశ్

నర్సీపట్నం అర్బన్, జనవరి 19 : విశాఖ జిల్లా భీమిలో ఈనెల 25న జరగనున్న ముఖ్యమంత్రి జగన్ బహిరంగ సభను అంతా విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గణేశ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఇక్కడ నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. జనసమీకరణ తదితరాలపై పలు సూచనలు చేశారు. మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మితో పాటు ఎంపీపీలు, జడ్పీటీసీలు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ జాతీయ నాయకుడు'

నర్సీపట్నం, జనవరి 19 : అంబేడ్కర్ ఒక జాతినాయకుడు కాదని, జాతీయ నాయకుడని మునిసిపల్ కమిషన్ రవిబాబు, తహసీల్దార్ అన్నాజీరావు అన్నారు. డీవీఎంసీ సభ్యుడు అప్పలరాజు ఆధ్వర్యంలో సామాజిక సమతా సంకల్ప మహోత్సవం శుక్రవారం ముగిసిన సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు అంతా కృషి చేయాలన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవో సూర్యనారాయణ, దళిత సేవా పరిరక్షణ జిల్లా అధ్యక్షుడు యాదగిరి దాసు, యల్లాజీ, అడిదెల బాబూరావు, మల్లవరపు సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాల కోసం ఆందోళన



సాగు భూములపై హక్కులు కల్పించాలని గిరిజనుల నినాదాలు

మాడుగుల, జనవరి 19 : దీర్ఘకాలంగా తమ సాగులో ఉన్న భూములపై వెంటనే హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ పలువురు గిరిజన రైతులు శుక్రవారం మండలంలోని ఒమ్మలి జగన్నాథపురం పంచాయతీ గదబూరు గ్రామంలో వినూత్న నిరసన తెలిపారు. మోకాళ్లపై నిలచి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఉర్లోవకొండ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా 350 మంది ఆదివాసి గిరిజనులం పొట్ట పోషణ నిమిత్తం 450 ఎకరాల్లో జీడిమామిడి తోటలు సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. తమకు అధికారులు వెంటనే పట్టాలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా గ్రానైట్ క్వారీల కారణంగా పంట భూములు నాశనమవుతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరట నర్సింహమూర్తి, పలువురు గిరిజనులు పాల్గొన్నారు.